క్లుప్తంగా

నేడు గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

కొందుర్గు: మండలంలోని బైరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభిస్తారని ఎంపీడీఓ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా దీపారాధన



దీపారాధన చేస్తున్న భక్తులు

కొత్తూరు: జేపీదర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని బాబా సన్నిధిలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజు స్థానికులతో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాడి రైతులకు అవగాహన

కొందుర్గు: మండలంలోని తిరుమని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ జోనల్ హెడ్ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అందిస్తున్న రైతు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల కోసం పంపిణీ చేస్తున్న దాణను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెరిటేజ్ సంస్థ కల్పిస్తున్న రూ.2లక్షల ఉచిత బీమా సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ ప్రతినిధులు సర్వోత్తమ రెడ్డి, వెంకటేశం, రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోకిల కార్యదర్శిపై కేసు నమోదు

శంకర్‌పల్లి: ఇటీవల సస్పెండ్ అయిన మోకిల పంచాయతీ కార్యదర్శి లక్ష్మీతులసిపై మోకిల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కలెక్టర్ శశాంక ఈ నెల 11న మోకిల కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ ఆదాయం తగ్గే విధంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాను సారం ఎంపీఓ గీత శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



చెరువులో నిర్మించిన ప్రహరీని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కేశంపేట: చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీని తహసీల్దార్ అజీంఅలీ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది పాక్షికంగా తొలగించారు. ఈ సంఘటన మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 9లో చెన్నం చెరువుతో పాటు కొంతపట్టా భూమి ఉన్నట్టు తెలిపారు. పట్టాభూమిలో కొంతభాగం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ఇటీవల కొనుగోలు చేసి అనుమతులు లేకుండా చెరువులో ప్రహరీ నిర్మిస్తున్నాడనే సమాచారం మేరకు తహసీల్దార్ తన సిబ్బందితో ప్రహరీని పాక్షికంగా తొలగింపజేశారు. అక్రమంగా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పేర్కొన్నారు.

బస్ టెర్మినల్ ప్రారంభం



బడంగ్‌పేట్: అందరికి అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట చౌరస్తాలో మిధాని డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ టెర్మినల్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గౌర రమాదేవి, రాళ్లగూడం సంతోష, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, బాలు, మిధాని డిపో మేనేజర్ ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'బడి'లో ఎన్నికలు

- నేడు నోటిఫికేషన్ విడుదల
- రెండేళ్ల నిరీక్షణకు తెర
- ఏర్పాట్లు చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు



ప్రాథమిక పాఠశాల భవనం

కేశంపేట: పాఠశాల విద్యాకమిటీల ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం కేజీబీవీ, జిల్లా పరిషత్, మండల ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను, సభ్యులను రెండేళ్ల కాలపరిమితికి ఎన్నుకుంటారు. వారు రెండేళ్లకు మించకుండా పదవిలో కొనసాగుతారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి పాఠశాల విద్యాకమిటీ సమావేశాలను నిర్వహిస్తుంది. ఈ సమావేశాల్లో పాఠశాల అభివృద్ధికి తీర్మాణాలను చేస్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 2019 నవంబర్ 30న ఎస్‌ఎంసీ కమిటీలను ఎన్నుకున్నారు. వీరి కాలపరిమితి రెండేళ్లు పూర్తయిన రాష్ట్ర ప్రభుత్వం పదవి కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.

కమిటీలో సభ్యులుగా...

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచరు, ఏఎన్‌ఎం, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారు.

కోఆప్షన్ సభ్యులు

పూర్వ విద్యార్థుల నుంచి లేదా విద్యావేత్తను లేదా దాతను లేదా స్వచ్చంద సంస్థ సభ్యులను తీసుకోవచ్చు. శాశ్వత ఆహ్వానితుడుగా సర్పంచ్ వ్యవహరిస్తాడు.

ఇవీ మార్గదర్శకాలు..

- ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున్న 15 మందిని ఎన్నుకోవాలి. వీరిలో 10 మంది మహిళలు ఖచ్చితంగా ఉండాలి.
- ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 21 మందిని, వీరిలో 14 మంది మహిళలు ఉండాలి. 8వ తరగతి వరకు ఉంటే 24 మందిని ఎన్నుకోవాలి. వీరిలో 16 మంది మహిళలను ఎన్నుకోవాలి.
- ఉన్నత పాఠశాలలో 6వతరగతి నుంచి 8వ తరగతి వరకు 9మందిని మాత్రమే ఎన్నుకోవాల్సి ఉంటుంది. వీరిలో 6మంది మహిళలను తీసుకోవాలి.
- ఆయా పాఠశాలలో సభ్యులందరూ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఓటింగ్ ద్వారా గానీ, చేతులెత్తడం ద్వారా గానీ ఎన్నుకుంటారు.

సభ్యుల బాధ్యత

- పాఠశాల కమిటీలో ఎన్నికైన వారు ఖచ్చితంగా కమిటీ సమావేశాలకు హాజరుకావాల్సి ఉంటుంది.
- పిల్లల చదువుల పురోగతిని పరిశీలిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడాలి.
- పిల్లల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తుండాలి.
- బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి.
- పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి.

నోటిఫికేషన్

- నేడు ఉదయం పది గంటలకు పాఠశాలలో ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ విడుదల కానుంది.
- మధ్యాహ్నం 2గంటలకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు అక్కడ చదివే విద్యార్థుల తల్లి దండ్రుల పేర్లను నోటీస్ బోర్డుపై ఉంచుతారు.
- 22న ఏమైన అభ్యంతరాలు ఉంటే ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రధానోపాధ్యాయుడు స్వీకరిస్తారు.
- 24న అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితను నోటీస్ బోర్డుపైన ఉదయం 11గంటలకు ఉంచుతారు.
- 29న మధ్యాహ్నం 1గంట వరకు ఎస్‌ఎంసీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు.
- 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4గంటల వరకు మొదటి సమావేశం నిర్వహిస్తారు.

అభివృద్ధి చేశా



నాలుగేళ్లుగా పాఠశాల అభివృద్ధికి సొంత నిధులను ఖర్చు చేశాను. అలాగే దాతల సహకారంతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దాను. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా స్థాయిలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేశాను. మళ్లీ అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయిలో నిలిచేవిధంగా ప్రయత్నం చేస్తాను.

– కుమ్మరి యాదయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్, జెడ్పీపాఠశాల, కొత్తపేట

రాజకీయాలకు అతీతంగా ఎన్నిక



పాఠశాల అభివృద్ధి కమిటీలో సభ్యులుగా, చైర్మన్, వైస్ చైర్మన్ చిత్త శుద్ధి కలిగి ఉండాలి. పాఠశాల అభివృద్ధికి అవసరమైతే సొంత నిధులను కూడా వెచ్చించాల్సి వస్తుంది. సమకుర్చిన నిధులతో విద్యార్థుల అవసరాలు తీర్చాలి. రాజకీయాలకు అతీతంగా ఎస్‌ఎంసీ ఎన్నిక జరిగితే వచ్చిన సభ్యులు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తారు.

– గోపని భీమయ్య, కాకునూర్ గ్రామం

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య



శ్రీశైలానికి నియామక పత్రం అందజేస్తున్న దయానందరావు, విజయ ఆర్య

షాబాద్: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగిల్ల దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కర్రె శ్రీశైలాన్ని నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. బహుజన రాజ్యంతోనే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు. బహుజనులందరూ కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, రాజమహేంద్రవర్మ, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్, సతీష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శనివారం కందుకూరులో నిర్వహించనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల వరకు కందుకూరు చేరుకుంటారని ఆయన తెలిపారు.

కందుకూరు మండల సర్వసభ్య సమావేశం నేడు

కందుకూరు: ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన శనివారం ఉదయం 10:30 గంటలకు కందుకూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

అక్రమాలను అరికట్టండి

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి పరిధిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరుతూ మాజీ ఉప సర్పంచ్ గొర్రెంకల యాదయ్య శుక్రవారం కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 15, కందుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 275 ప్రభుత్వ భూముల్లో కొందరు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, ఇక్కడ నిర్మాణాలు సైతం కొనసాగుతున్నాయని తెలిపారు. మరోపక్క ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

కేంద్రం విధానాలపై పోరాడుదాం

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషాన రహరి భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ అధ్యక్షతన రైతు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు నిరుపేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, లేబర్ కోడ్ బిల్లుతో కార్మిక రంగం కుదేలయ్యేలా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిబ్రవరి 16 వరకు కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. మోదీ దుర్మార్గపు పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేవెళ్ల: మండలంలోని చేవెళ్ల విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు 33 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ అంతారయం ఉంటుందని ఏఈ మహ్మద్ జానిమోహినుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్లు, చెట్లకొమ్మలు, పొదల తొలగింపు పనులు చేపడుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరా తాత్కాలింగా నిలిపేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 13 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా మొయినాబాద్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సురంగల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించగలరని ఆయన కోరారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ మండలంలో అన్ని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల మరమ్మతులు, వైర్లకు తగులుతున్న చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి పరిధిలోగల సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తారని రూరల్ ఏఈ రాకేష్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా చటాన్‌పల్లి, దూస్కల్, సోలీపూర్, లింగారెడ్డిగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దీనికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు మిషన్లను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చేవెళ్ల: ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేపీ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ టి రాజ్‌కుమార్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో వారం రోజులుగా ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణపొందిన 10 మందికి కుట్టుమిషన్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో కూడా మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు స్వయంఉపాధిలో రాణించి ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు శశికుమార్, మహిళలు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో దర్గా మరమ్మతులకు, ప్రహరీ నిర్మాణానికి ఎంపీ నిధులతో చేపట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలతో పాటు ముస్లింల సంక్షేమానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పీసరి రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితల పంపిణీ



హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న కుమ్మరి చెన్నయ్య, కుమ్మరి దర్శన్

షాబాద్: అయోధ్య రామ మందిర అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాచన్‌పల్లి, సంకెపల్లిగూడ సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, కుమ్మరి దర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం మాచన్‌పల్లి, సంకెపల్లిగూడ గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు పాటలు, భజన చేస్తూ ప్రతీఇంటికి తిరిగి అక్షితలు అందజేశారు. అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షితల పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీరాముడి ఆలయ ప్రాణప్రతిష్ఠ సమయంలో వేసిన అక్షితలను దేశవ్యాప్తంగా ఉన్న హిందువుల గృహాలకు చేర్చాలని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఆ అక్షితలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేందర్ రెడ్డి, కూతురు మహేందర్, సత్యం, రామస్వామి, రాంచంద్రయ్య, గిరీష్, రాములు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి

మొయినాబాద్‌రూరల్: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో డి గౌతమి డాక్టరేట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవ్యాల్యుషన్ ఆఫ్ నావెల్ క్వినో స్కలిన్ అండ్ ఇండోల్ స్కాఫ్ఫోల్కెడ్స్ అండ్ పెయిర్ మాలిక్యూలర్ డాకింగ్ స్టడీస్' అనే అంశంపై డాక్టర్ రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్ పర్యవేక్షణలో డి గౌతమి పరిశోధన చేశారన్నారు. అనంతరం యూనివర్సిటీ కులపతి డాక్టర్ సిహెచ్‌వి పురుషోత్తమ్‌రెడ్డి, సాత్వీకారెడ్డిలు గౌతమిని అభినందించారు. ఈ సమావేశంలో డీన్ ప్రొఫెసర్ ప్రతాప్, ప్రొఫెసర్ కిష్టఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, హెడ్ ప్రొఫెసర్ రాజేందర్, అధ్యాపకులు అవని, మహాదేవ్, కన్నాన్, శ్వేత, దేవ్ పాండే, లక్ష్మి, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు, కంట్రోలర్ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటుహక్కు దరఖాస్తు చేసుకోవాలి

- నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్
- ఆర్డీఓ వెంకటమాధవరావు



షాద్‌నగర్‌రూరల్: అర్హులైన ప్రతిఒక్కరూ కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ వెంకటమాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణలను పకడ్బందీగా నిర్వహించారన్నారు. పద్దెనిమిది ఏళ్లు పైబడిన వారందరూ తప్పని సరిగా ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు, చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు, ఓటరు జాబితాలో సవరణలకు ఈ నెల 22వరకు గడువు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

తుక్కుగూడ: గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తో సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బాసగూడతండాకు చెందిన గిరిజనులు ఆయా పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీ పథకాల ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని కిచ్చనగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చిన సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో, నీటి పారుదల శాఖ సహకరించకపోవడంతో పూర్తి స్థాయి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని సభ్యులు సభదృష్టికి తెచ్చారు. ఇంద్రారెడ్డి నగర్, మాసానిగూడ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు సభ్యులు సభలో వాపోయారు. ఈ విషయంలో అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని సర్పంచ్ రవిందర్‌గౌడ్, రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని, విద్యుత్ వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని పలు మార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్‌లు ఏనుగు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మోకిల పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయిన విషయాన్ని తనకు, సర్పంచ్‌కు గానీ ఎందుకు తెలియజేయలేదని ఎంపీవో గీతను ప్రశ్నించారు. నీటి పారుదల శాఖ అధికారులు లంచం తీసుకుంటూ చెరువు, కాలువల్లో పైపులు వేయిస్తున్నారని, వాగులకు సంబంధించిన భూముల్లో ప్రహరీల నిర్మాణానికి సహకరిస్తున్నారని ప్రొద్దటూరు సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి ఆరోపించారు. దాతల సహకారంతో పెద్దటూరు పెద్ద చెరువు కాలువను సుమారు రూ.60లక్షలతో మరమ్మతులు చేయిస్తే, అక్రమ నిర్మాణాలకు అధికారులు సహరించడం ఎంటని ప్రశ్నించారు. జనవాడ గ్రామ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డుగా ఉన్న డ్వాక్రా భవనాన్ని కూల్చేసేందుకు అధికారులు అనుమతులు ఇవ్వాలని, కొత్త భవనాన్ని సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు సర్పంచ్ లలిత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, తహసీల్దార్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సదానందస్వామి ముదిరాజ్‌కు వివేకానంద సేవా అవార్డు



కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన కాకి సదానందస్వామిముదిరాజ్ స్వామి వివేకానంద సేవా పురస్కారాన్ని అందుకున్నారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించింది. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారిని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ మంత్రి డాక్టర్ బాబుమోహన్ చేతుల మీదుగా సదానందస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.